
# మనిషి చేసిన మనిషి



'అదేం కాదు లేరా, మరి ఈ రచయితల కందరికీ ఇదొక జబ్బైపోయిందంటే, నమ్మ' అన్నాడు రావు సిగరెట్ పొగ వొదుల్తూ.

'నువ్వేమయినా చెప్పూ, ఆ బీద సాదల్లో కన్పించే సున్నితభావాలు మనలో మచ్చుకైనా కన్పించవు. ఎలా కన్పిస్తాయి చెప్పు? మనకి బజార్లో కాఫీపొడి దొరకడం లేదనేగా దిగులు. ఆకలి నెరుగున్నవాడు కరుణార్ద్రహృదయుడు కాకపోడు. అవకాశమే వుంటే ఇంకొకడికి పిడికెడు మెతుకులు పెట్టకుండా తాను ముద్దకూడా మింగడు. మనమో? కాఫీకి వెళ్లే సమయానికి మరొకడెవడైనా కన్పిస్తే చాలు, వీడెక్కడ దాపరించాడ్రా అని బాధపడ్తూ, పైకిమాత్రము కృత్రిమ సంతోషాన్ని అభినయిస్తూ, వాడు వెళ్లేదాకా ఓపికపట్టి, వాడు వెళ్లిన మరో నిమిషానికల్లా కాఫీ హోటల్లో తయారు. సరీగ్గా అక్కడే వాడూ మనకి ప్రత్యక్షం. ఆ నిమిషంలోనే కనుక భావాలకు ఫోటోలు తీయగల్గితే, మానవహృదయం-అది సహజహృదయం కాదులే-యొక్క లోతుపాతులను చూపెట్టి ధన్యుణ్ణయ్యేవాణ్ణి. అదుగో, అక్కడ ఆ చెట్టుక్రింద కూర్చొనివున్న వల్లురిసీ చూడూ. చీకటి పడేంతవరకూ ఏం చేస్తూంటారో ఏమో, రాత్రయ్యేసరికి 'మాతా, కబళం' అని బయల్దేరతారు. తెచ్చుకున్నదాన్ని నలుగురూ కలసి ఎంతో హాయిగా తింటారు. నిజంగా వారే మానవహృదయాలను ఎక్కువగా అర్థం చేసుకున్నవారు. ఏమంటావా, ఏయింటిలో ఏవ్యక్తిలో దయారసము మూర్తీభవించి వుందో, వారికే తెలుసు. సరీగ్గా ఆవ్యక్తి వాకిట్లో నిల్చొని వున్నప్పుడే అక్కడికి వెడతారు .....' అని ఇంకా ఏమేమో చెప్పబోతున్నాడు శాస్త్రి - సగంకాలిన సిగరెట్టును విసుగ్గా అవతలకు పారేసి, శూన్యంలోకి పొగను వొదిలేసి.

"ఏమిత్రా, ఇందాకటినుంచి తెగ లెక్చరు ఇచ్చేస్తున్నావు. బీదవారే మానవులనీ, వారికే హృదయస్పందనము కలుగుతుందనీ, వారిలో వుండే భావసౌందర్యము కాస్త కలిగివుండేవారికి వుండదనీ ఇంకా ఏమేమో చెపుతున్నావు. మానవుడన్న ప్రతి వాడికి మానవప్రకృతి వుండకమానదు కాకపోతే కలిగివున్నవాడు తానుండే పరిసరాలకి జవాబుగా ఒక విధమైనట్టి జీవితాన్ని గడపాలి. ఆ జీవితానికి ఆదిమ నివాసిలోవున్నట్టి భావాలకు అవసరములేదు. కాని ఒక నిరుపేదకు ఆహారము సంపాదించుకోవడమే పెద్ద బ్రహ్మాండమైపోతుంది. దానితోటి ఆతనిలోవున్న మానవజంతువు పైకి వస్తుంది. అందుచేత నీకూ, నాకూ వారి భావాలు చాలా సహజంగానూ, మన భావాలు చాలా కృత్రిమంగానూ కన్పిస్తాయి."

"అయితే..." ఇంకా ఏమో అడగబోతున్నాడు శాస్త్రి.

రావు అందుకొని "శాస్త్రీ, నే చెప్పేదంతా విని, నీ సమాధానమేమిటో చెప్పు. సహజ భావాలకీ, కృత్రిమ భావాలకీ నిరంతరము పోరాటం సాగుతూనే వుంటుంది. స్థానబలిమి మూలాన్ని కృత్రిమభావాలకే శక్తినిచ్చి, సహజత్వాన్ని కోల్పోతాడు మానవుడు. నువ్వు కృత్రిమ భావాలంటే చెడ్డభావాలనే అపోహపడవద్దు. సైజాన్ని కోల్పోయిన భావాలన్నమాట. అంతే. ఈ పోరా

టంలో కొన్ని కొన్ని సంఘటనలు చూచినతర్వాత, కృత్రిమభావాలశక్తి అనంతమైపోయిన మానవునిలోకూడా సహజభావాలు తలెత్తడం కద్దు. తలెత్తి దెబ్బతీయడం కద్దు. లేక లేక తిన్న ఆ దెబ్బకు కృత్రిమ భావాలు ఎదుర్కోలేక లొంగిపోతాయి. చూడూ, నేను కలకత్తాలో చదివేరోజులవి. ఆ రోజుల్లోనేగా బెంగాలులో క్షామదేవత ప్రళయతాండవం చేసింది. ఆ తాండవ మర్దనానికి ఎంతమంది చనిపోయారో నీకు తెలిసే వుంటుంది. ఆ క్షామఫలితాన్ని మనము ప్రాణాల కొలతతోటి మాడడం చాలా పొరపాటు. (ఈ క్షామమరణాలన్ని) మానవునిలోని జంతువు ఎంత పైకివచ్చిందా అనేసంగతి గుర్తించాలి. అదీ, నిజమైన కొలబద్ద. నేను మానవజంతువు అన్నప్పుడు అతనిలోవుండే తగ్గురకపు భావాలేకాక—ఆత్మరక్షణ, స్వార్థము ఇలాంటివి—కరుణ, ప్రేమ మొదలైన ఉదాత్తభావాలను కూడా సూచిస్తున్నాను. ఏమంటావా, ఈ భావాలన్నీ కూడా ప్రతిప్రాణికీ వున్నాయి. మొదటిరకపు భావాలు ఎలా చెలరేగిపోయాయో ! తలుచుకుంటే, ఇప్పుడు కూడా ఒళ్లు జలదరిస్తుంది. ఎంతమందో స్త్రీలు, ఒక్క పిడికెడు మెతుకులుగ్గాను తమ దేహాన్ని అమ్ముకున్నారు. ఆకలిమంటముందర ఆత్మగౌరవం యొక్క విలువ వారికి తెలియనేలేదు. ఆకలితీరిన తర్వాత ఏదో కోల్పోయినట్లు అతిదీనంగా విలపించేవారు. నైతికశక్తి ఎక్కువగావున్న వ్యక్తులు మరి రెండుమూడు రోజులు మాడినతర్వాత, మళ్ళీ వారిలోని జంతువుకు శక్తిహెచ్చి, తిరిగి పాతాళానికి పతనమైపోయేవారు. ఇలా రెండుమూడు సార్లు జరిగినతర్వాత ఆజీవనమే మంచిదనుకొని, వ్యభిచారవృత్తికి మరలినవారెందరో వున్నారు. ఇంతేనా ? భార్యమీద భర్తకు అభిమానములేదు. అవినీతిమార్గాన్ని భార్య సంపాదించిపెడ్తే, ఎంతో మంది భర్తలు సంతోషించారు. అన్నిటికన్నా విచిత్రము ! ఆ ఆకలిమంటలో, ఆ క్షామములో మాతృప్రేమకు కూడా స్థానము లేకపోయింది ! ఇలా బీదప్రపంచము వుంటూంటే, అతిమార్దవ భావాలతో నిండిపోయిన ధనవంతులు లేకపోలేదు. సాధారణ పరిస్థితుల్లో అంతటి మార్పు ఏ ధనవంతుడిలోనూ వచ్చేది కాదు. చూడూ, మజుందారు అనే పెద్ద పెట్టుబడీదారు ఉండేవాడు కలకత్తాలో. చీకటి మార్కెట్టులో నిధి. ఒక్క సంవత్సరములో లక్షలు సంపాదించాడు. హృదయము కఠినతమమైపోయింది. డబ్బు, డబ్బు-ఇదే వాడిపలవరింత. లక్షమీద లక్ష పెరగాలట. రోజూకాక రెండువేలేనా లాభము చూస్తే కాని, నిద్రపట్టేది కాదు మానవుడికి. ఇల్లాంటివాడు వున్నట్లుండి వ్యాపారము మానేశాడు. చేస్తే గీస్తే గింజలను కొన్నధరకే అమ్మేవాడు. అదైనా బీదసాదలకే. కలకత్తా, కలకత్తా విస్తుపోయింది. నాకు మాత్రం ఈ మజుందార్ని గూర్చి 24 గంటలూ ఆలోచనే. ఇతనిలో ఏదో గొప్ప మానసికమైన మార్పువచ్చి వుండాలి; లేకపోతే ఎందుకిలా వ్యాపారాన్ని నిలిపేస్తాడు, అనుకుంటూండేవాణ్ణి. అతన్నే వెళ్ళిఅడుగుదామనుకున్నా, కాని ధైర్యము చాలలేదు. అప్పటికప్పుడే రచయితని కదూ కాస్త. అడిగితే మంచి కథావస్తువు దొరుకుతుందనుకున్నా. ధైర్యంచేసి వెళ్లాను మజుందారింటికి. వెళ్ళగానే ఎంతో మర్యాదతో ఆహ్వానించాడు లోపలకు. కూర్చోపెట్టి స్వయంగా 'టీ' కలుపుకొచ్చి ఇచ్చాడు. మజుందారులోని మార్పులు ఇప్పటికప్పుడే గ్రహించగలిగాను. అతనిలో సేవ చెయ్యాలనే కోరిక చాలాబలంగా వుందని తెలుసుకున్నా. కానీ, ఇన్నాళ్లూ గడిపిన జీవితవిధానము మూలాన ప్రపంచము తన్ను నమ్మదని భయపడ్తున్నాడు. ఇలాగ నాలో నేను ఆలోచిస్తూండగానే, మజుందారు బెంగాలీలో నన్ను 'మీ దీవూ రేనా?' అని అడిగేడు. బెంగాలీ భాషతోటి పరిచయ మున్నప్పటికీ సంభాషణ కుపక్రమించేంత భాషా జ్ఞానము లేదు నాకు. అంచేత 'నాకు బెంగాలీ రాదండీ' అన్నాను. ఇంగ్లీషులో ప్రారంభించాము సంభాషణ. ఉభయకుశలోపరి, 'నేను మిమ్మల నొకప్రశ్న వెయ్యాలనుకుంటున్నా, మరేమీ అనుకోరుకదా' అన్నాను. 'మీరడిగే ప్రశ్న ఏమిటో నాకు తెలుసు. ఇంతకుముందు ఎందరో వచ్చారు నా సమాధానాన్ని వినాలని. కానీ వారందరూ బెంగాలీలు. వారికిచెప్పడం నాకిష్టంలేదు కనక నేను చెప్పలేదు. మీరు తెలుగువారన్నారు కాదూ ? నేచెప్పే సమాధానాన్ని ఆధారముచేసుకొని, ఎప్పుడుకూడా ఏ రచనా సాగించనని ప్రమాణంచెయ్యండి. అలాగే నేనెందుకు వ్యాపారం మానేశానో చెప్తా' నన్నాడు మజుందారు.

నాకు పీపుమీద చరిచినట్లయింది. నేను ఇతని దగ్గరకు కథావస్తువు కోసం వచ్చానని ఎలా గ్రహించారో చెప్మా అనే ఆలోచనలోపడ్డా. ఇంతలో తేరుకొని 'నేను మీ చరిత్రను కథావస్తువగా వుపయోగించను' అని ప్రమాణంచేశాను.

'అయితే వినండి కథ' అని ప్రారంభించాడు మజుందారు. 'నేను 1941–43 ల మధ్య లక్షలు ఆర్జించాను. ఈ ఆర్జనంతా కూడా చీకటిమార్కెట్టులో సాగించిందే అది ఎలావచ్చినా డబ్బే ననిపించేది, నాకు. నాకు కావలసింది డబ్బే కనక ఎలావస్తూందా అనేదాన్ని గూర్చి ఎన్నడూ ఆలోచించేవాడిని కాదు. లక్షమీద లక్ష కూడింది. ఇంతలో క్షామం వచ్చింది. పీనుగుపెంటలుకూడా నన్ను కదిలించలేకపోయాయి. నాకు కావలసింది డబ్బేగా. ఒకరోజు సాయంత్రం దగ్గరలో నున్న పార్కుకువెళ్లి చీకటిపడ్డాక ఇంటికి తిరిగి వస్తున్నా. మాగేటుకుకొంచెం ఇవతల నలుగురు– తల్లి, తండ్రి, ఇద్దరు కొడుకులు కీచులాడుతున్నారు. ఎందుకో ఏమోననుకొన్నా. ఒక ఎంగిలాకుకోసం. నేను చూడలేకపోయాను కాని ఏమి జరుగుతుందో చూద్దామన్న కోరికతోటి ఒక చెట్టు చాటున నిల్చున్నా. తండ్రి ఆ ఎంగిలాకు తనభాగమనీ, తాను తిన్నతర్వాత మిగిలింది తల్లికనీ, అదయిన తర్వాత బిడ్డలకనీ చెపుతున్నాడు. తల్లి అది తనకే రావలసిన వంతని పేచీపెడుతోంది. ఆ కుర్రాళ్ళల్లో పెద్దాడికి పద్దెనిమిదేళ్లు. రెండోవాడు ఆయిదేళ్ళవాడు. ఇంతదాకా నోరుచేసుకొని పెద్దవాడు, ఎక్కడనుంచి తీశాడో ఏమిటో ఒక గునపము, దాన్ని తీసుకొని ఆ తల్లిదండ్రులను పరలోకానికి పంపించాడు. నేను ముందరకి అడుగు వేశాను. అతను ఆ ఎంగిలాకు తీసుకొని పరుగెత్తేడు. ఆయిదేళ్ళ కుర్రాడు ఏడవడం ప్రారంభించాడు. జాలివేసింది. వాడిని తీసుకొచ్చాను ఇంట్లోకి. నేనూ, నాలాంటివారూ మా వ్యాపారాలమూలాన్ని మానవులను మానవులుగా బ్రతకనివ్వకపోవడమే కాక, వారిని కుక్కలస్థితికి తెచ్చాము కదా అని ఆనాడు తెలుసుకొన్నా. అంచేత వ్యాపారం మానేశాను.'

'అంతదాకా ఉన్న సరళత్వము ఏమైపోయిందో, ఇంట్లో - ఇక్కడనుంచి వెళ్ళిపో - అని ఒక్క కసురు కసిరేడు. బ్రతుకుజీవుడా అని ఒక్క పరుగులో బయిటికి వచ్చేశాను. చూచావా శాస్త్రీ, ఆ మజుందార్లో సున్నితభావాలు పొడచూపేయంటావా, లేదా ?'

'ఏమో !' అన్నాడు శాస్త్రి, తన అభిప్రాయం మారలేదని సూచిస్తూ.

'నీ అభిప్రాయాన్ని నేను లెక్కచెయ్యక్కర లేదులే అన్నట్లు, రావు మరో సిగరెట్టు వెలిగించాడు.

# 'అభినవ వేమన' పద్యాలు

ము కామేశ్వరరావు

'వేమనపద్యాలు' అను శీర్షికక్రింద 'యిమిటేషన్ వేమనపద్యాలు' కొంతకాలంనుంచి కొన్ని పత్రికలలో ప్రకటింపబడుచున్నవి. యోగివేమన ఆదర్శానికి పూర్తిగా వ్యతిరేకమైన ఆధునిక కాలపు పద్యాలువ్రాస్తూ, 'విశ్వదాభిరామ వినురవేమ' అను యీ చివరిపాదముకు తమ పద్యములలో చొప్పించుట శోచనీయము. వేమన, తనకు పూజనీయుండైన అభిరామయ్యకు అంకితమొనర్చిన 'విశ్వదాభిరామ వినురవేమ' నేటి పద్యములలో చివరి పాదముగా గ్రహించుట తగనిపని.

ఆధునిక కాలమున నుపయోగించు పద్యములు వ్రాయు నేటి రచయితలు తమ పద్యముల చివరి పాదమును యీవిధముగా అమూల్యగ్రంథముల నుండి యెరువు తెచ్చుకొని పూర్వగ్రంథముల యొక్క గౌరవమును పాడుచేయుటకంటె, తమ పద్యములయొక్క ఆదర్శమునకు అనుగుణముగా నూతనముగా కల్పించి పద్యముల చివరిపాదముగా ఉపయోగించిన తమ నేర్పరితనమును ప్రదర్శించినవారై అభ్యుదయ మార్గదర్శకులు కాగలరు.

ఇప్పటికే—వేమనగ్రంథములోని కొన్ని పద్యములు మధ్యకాలములో కొందరు ప్రముఖులు వ్రాసినవని, యిష్టమువచ్చినట్లు కొందరు సంస్కరించిరని ప్రజలు తమకు తోచినవిధముగా చెప్పుకొనుచున్నారు. ఈ యిమిటేషన్ వేమనపద్యాలను ప్రత్యేకశీర్షికలుపెట్టి అచ్చువేయుచు కొందరు సంపాదకులు ప్రోత్సహించుచుండుట తగదు.